# అది మా పని గాదు

"శంకరం ! నువ్విక్కడ పోలీసుశాఖకి పెద్ద అధికారివి కదా. ఈ విషయంలో ఏమైనా చేస్తావని వొచ్చాను. ఇదుగో, ఇది మాకు కొళాయిల్లో సరఫరా అయ్యే నీటి శాంపిల్. ఈ టెస్ట్ ట్యూబులన్నీ ఆ నీళ్ళని కెమికల్ అనాలిసిస్ చేసినప్పటి వివిధ టెస్టుల ఫలితాలను చెప్పేవి. చివరిగా మనకొచ్చిన రిజల్ట్ ఏమిటంటే, ఈ నీళ్ళలో 0.008 శాతం ఒకానొక విషం కలుస్తోంది.

ప్రస్తుతానికి మనుషులు చచ్చిపోరు. కాని పదేళ్ళ తరవాత రోజుకి రెండేసి వేలమంది చొప్పున అన్ని వయసుల వాళ్లూ మరణిస్తారు. ఈ నీళ్లు తాగిన పశువులూ కుక్కలూ ఏడాది లోపల చస్తాయి. ఈ నీళ్లు తాగిన పశువుల పాడి తీసుకొనే మనుషులు మామూలుగా పదేళ్ళలో చావవలసినవాళ్లు ఎనిమిదేళ్ళకే చస్తారు. అంచేత అర్హత గల సైంటిస్టుగా కంప్లెయింట్ రాస్తున్నాను. దీనికి కారణం అయిన దేవేంద్రా కంపెనీ యజమానుల మీద మాస్ మర్డర్ (సామూహిక హత్య) కేసు రిజిస్టర్ చేయించాలి" అన్నాను.

"దేవేంద్రా కంపెనీ మీదనా? అమ్మ బాబోయ్ వాళ్లు టాక్సుల క్రింద ఏడాదికి అయిదుకోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నారు. బిగ్ షాట్స్!"

"ఎవరైతేనేం వాళ్ళ ఫ్యాక్టరీనుంచి మురుగు రద్దు అన్నీ అశోకా డ్రెయిన్‌లోకి వెడుతున్నాయి. ఈ వూరి నీటి సరఫరాకోసం త్రవ్వించిన మూడు బావుల్లోకి ఆ మురుగు ప్రవేశిస్తోంది. ఫిల్టరుబెడ్స్ దాటి సరాసరి కొళాయిలోకి వచ్చేసరికి 0.008 శాతం విషం నికరంగా తేల్తోంది. అప్పుడప్పుడు అశోకా డ్రెయిన్‌లో నీళ్లు తాగిన పశువులు అక్కడికక్కడే మరణించడం మీరు చూస్తూనే వున్నారుగా?"

శంకరం ఆలోచనలో పడ్డాడు. "ఇది మాస్‌మర్డర్‌గా రిజిస్టర్ చెయ్యొచ్చా అని. ఇందులో ప్రత్యక్ష సాక్ష్యం లేదు. మోటివ్ లేదు-" అంటూ కొంత సాంకేతిక జ్ఞానం బయటపెట్టాడు.

"నువ్వు కూడా కొత్తతరం వాళ్ళలాగే ఆలోచిస్తున్నావు. మా అన్నయ్యగారి ఆఫీసులో గుమాస్తాలు అల్లాగే డాక్‌లో కాగితం వస్తే దాన్ని క్రీ గంట గమనించి ఈ కాగితం నేను డీల్ చెయ్యక్కర్లేదు అని రాయడానికి ఉపాయం వెతుకుతారు."

శంకరం ఒక నిశ్చయానికి వచ్చిన వాడిలా అరచేత్తో బల్లమీద కొట్టాడు "నో ఇది పోలీస్‌కేస్ అవదు. ఆ ఫ్యాక్టరీ పెట్టిన ఈ రెండేళ్ళలో సుమారు 200 పశువులు చనిపోయాయని తెలుస్తోంది. కాని అవి అశోకా డ్రెయిన్‌లో నీళ్లు తాగకుండా వాటి సొంతదార్లు జాగ్రత్త పడక పోవడంవల్ల జరిగిందిగాని, దేవేంద్రా కంపెనీవారు దానికి ప్రత్యక్షంగా బాధ్యులుకారు. అంతెందుకు? వాల్‌టాక్స్ కంపెనీ నుంచి రోజూ పగలూ రాత్రీ విడుదలయ్యే విషవాయువులవల్ల గాలివాటు దిక్కున వున్న పన్నెండు గ్రామాల్లో ప్రజలందరూ న్యూరోసిస్‌తో బాధపడుతున్నారు. అవన్నీ వెనక శంభోజీరావుగారు న్యూస్‌పేపర్లలో బట్టబయలు చేశారు. కాని ఏమీ చర్య తీసుకోలేదు. అదికూడా పోలీస్ కేసు కాలేదు. అప్పుడు కేసు పెడితే ఆ కంపెనీకి పదివేల రూపాయలు జరిమానా వేశారు. ఇక మీదట ఆ విషవాయువులు విడుదల కాకుండా

జాగ్రత్త పడతామన్నారు. అంతే నువ్వీ వూరికి కొత్తగా వచ్చేవు; నీకు తెలియదు. ఇదంతా వాతావరణ కాలుష్యం క్రిందికి వస్తుంది తప్ప ప్రత్యక్ష చర్యకు తోడ్పడదు. ఇంతకీ నువ్వు అక్కడెక్కడో మధురా రిఫైనరీకి సెలక్టయ్యావు కదా; ఆ ఉద్యోగం ఎందుకు మానేసినట్టు?"

"అదీ ఈ రకం సమస్యే. అక్కడ ఫ్యాక్టరీలో విడుదలయ్యే మురుగు యమునా నదిలో కలవకుండానూ, ఆ విషవాయువుల వల్ల, ఆ ప్రాంతంలో ప్రజలూ అందమైన కట్టడాలూ దెబ్బతినకుండానూ గట్టి ఏర్పాట్లు చెయ్యాలని, లేకపోతే దేశద్రోహం కాగలదనీ మేనేజ్‌మెంటుకి నోట్ పెట్టాను. దాంతో నాకు టెర్మినేషన్ నోటీసు సర్వ్ చేశారు" అన్నాను.

"నీ వాదం ప్రకారం ఏ ఫ్యాక్టరీ పెట్టినా దేశద్రోహమే అవుతుంది మరి. అన్ని కెమికల్ ప్లాంటులూ కూడా ఏదో ఒక ఎఫ్లుయన్సును విడుదల చేస్తూనే వుంటాయిగా. ఇలా అయితే నువ్వు ఉద్యోగం పాడూ లేకుండా ఖాళీగా కూర్చోవడమే" అన్నాడు శంకరం.

"పోనీ నేను కోర్టులో కేసు దాఖలు చెయ్యనా, దేవేంద్రా కంపెనీ మీద? బాధ్యత గల పౌరుడిగా, భావితరాల ప్రజల సంక్షేమం గురించి అలా చెయ్యొచ్చేమో?" అన్నాను.

"చెయ్యొచ్చు. కేసు గెలిస్తే వాళ్ళకి అయిదువేలో పదివేలో ఫైన్ వేస్తారు. వాళ్ళు ఆ సొమ్ము ఎడంచేత్తో కట్టి అవతల పారేస్తారు. అలా ఏడాదికోసారి జరిమానా వేసినా కట్టెయ్యగలరు వాళ్ళు. నీకు మాత్రం కోర్టు ఖర్చులు, అడ్వకేట్ల వెంట తిరగడం, వాయిదాలకి హాజరు కావడం తప్పదు."

"అయితే నన్నేం చెయ్యమని నీ సలహా?"

"ఏముంది? సాంకేతిక పరిజ్ఞానం వుంది కనక దీన్ని గురించి ఒక ఘాటైన వ్యాసం రాయి. ఏ పత్రిక అయినా సన్‌డే సప్లిమెంటులో వేసుకుంటుంది; యాభయ్యో వందో ప్రతిఫలం కూడా వస్తుంది?"

(10-11-79)